*జీవితం రైలు ప్రయాణం. అనుభవాలు దాటిపోయిన స్టేషన్లు. ఆ లయ నిరంతరం. రైలు యెప్పుడూ ముందుకే, జీవితం "రేపు" వైపే ప్రయాణిస్తుంది.*

**కంపార్ట్‌మెంట్ ఖాళీగావుంది. ఒంటరిగా....బ్రతుకులోనే ఒంటరితనం.... కిటికీలో చంద్రుడు. ఒంటరి చంద్రుడు. చుట్టూ మబ్బులున్నా ఒంటరిగానే ఉన్నాడు.**

పౌర్ణమినాడు ప్రయాణం. మంచిదా? కాదా? ఏ రోజయితేనేం.... అన్నీ ఒక్కలాగే ఉన్నాయి రోజులు. గొంతులో దుఃఖం, కన్నీళ్ళు. ఛీ పబ్లిక్ ప్లేస్‌లో ఏడవకూడదు. ప్రొహిబిటెడ్-రైల్వే కంపార్ట్‌మెంట్ పబ్లిక్ ప్లేసా? బయట గుడిసెలు- ప్రశాంత జీవితం ఏదీ ఎక్కడ? ఇల్లును బట్టి ప్రశాంతత? వాళ్ళకెన్ని కష్టాలో? మనదెంత? అయినా... మళ్ళీ గొంతులో తడి... దుఃఖం... గొంతు నెప్పి... బాధ... కన్నీళ్ళు దాయడానికే ఇంత కష్టపడితే... గరళాన్ని గొంతులో ఆపడానికి ఆ పరమ శివుడెంత యాతన పడ్డాడో...

ఖాళీ బెర్తులు. అన్నీ ఖాళీ ఈ ఒంటరితనంలో అతడే వుంటే ఎంత బాగుండును ? ఎన్ని కబుర్లు. స్నేహం అంటే వీళ్ళ కెలా తెలుస్తుంది. ప్రపంచంలో విలువైనవన్నీ అరుదైనవే. పోనీ రాజీ బెజవాడలో ఎక్కితే ఆశ్చర్యపోతుంది తెల్లారేదాకా కబుర్లు చెప్పుకోవచ్చు. మరి నిద్దరో.. నా దుఃఖాలన్నీ చెప్పుకోవచ్చు చెప్పుకోవడం బలహీనత.. దాచుకోవడం ఎంత కష్టం ?.... శివుడంత వాళ్ళమా ?.. మళ్ళీ గొంతులో బాధ.... వుండలు వుండలుగా....

ఏదో స్టేషను. చెట్లు, మేడపాడు.... తురాయి చెట్టు. మేడపాడు జ్ఞాపకం-పిన్ని ఏల్చేరు ప్రయాణం.... పద్నాలుగు సామాన్లు గొడుగుతోసహా.

కాలవమీద వెన్నెల....వృధాగా....నీటిపాలు.... జీవితం.... .... అన్నీ వృధా.... ఎక్కవలసిన రైలు.... ఆరుద్ర....చైన్లులేని బండి యిది....దూకి వెనక్కి వెళ్ళనా. నే నెక్కాల్సిన బండి యెప్పుడో ఔటరు దాటేసి వుంటుంది. షటిల్ సర్వీస్... పొరపాటు రైలు.... పొరపాటు యెక్కడాలు.... కండక్టరు.... టిక్కట్టు చూపమంటున్నాడు.... సీటుమీద సెటిలయిపోయాడు....మంచివాడల్లే వున్నాడు.... ఆ.... ఎక్కడో చూసిన గుర్తు.... రాజ్యలక్ష్మి.... శేషదాస్.... ప్రతాపు .... మిసెస్ రావు బావగారు... అయితే ఈయన బాగా నలుపు.... పేరు రామారావు-ప్లాస్టిక్ ప్లేట్ మీద పేరు. చిల్లర తరవాత ఇస్తాడట.... ఇస్తాడా? ఇవ్వడా?.... పోన్లే.... "ఒక్కళ్ళే ఉన్నారు.... ఇంకో బెర్తు ఇస్తాను.... నేనే వచ్చి ఇస్తాను."

తాడిచెట్లు.... లైనుగా.... క్రోటను మొక్కల్లాగా.... గుళ్ళు.... తిరుపతిగుళ్ళు. గుండాయన ఇటే చూస్తున్నాడు.... ఎందుకంత ఇబ్బందిగా చూట్టం ... ఆడ్‌గా.... అసహ్యంగా....

కండక్టర్ మళ్ళీ వస్తాడేమో.... తలుపులు మూసేస్తే ఎలా ?.... చప్పుడు.... కదలిక.... అట్నించిటు.... ఎలకలున్నాయా ?.. బొద్దింకలున్నాయి .... బొద్దింకలున్నాయి.... .... పొగనల్లగా బయట.... బొగ్గు.... ఛస్తాలా.... అటూ ఇటూ ఊగుతోంది రైలు.......... చప్పుడు.... అంత గట్టిగా వేయాలా తలుపు !.... రైలు చప్పుడు.... లయ.... దాటిపోతున్న ఇళ్ళు.... చెట్లు.... లైట్లు.. టకటకటక.... లయ.... రైలు... లైటు ఇందాకటికంటె బ్రైట్‌గా వెలుగుతోంది. బ్రైట్ ప్లాస్టిక్కు.... "కు" తెలుగువాడి ఇంగ్లీషు.. రామారావుగారు.. వ్యంగ్యం.. అసహ్యం కలిగించే వ్యంగ్యం వెగటు....

ఇంకా రాడే కండక్టరు.... అబ్బ.... చప్పుడు.... అంతగట్టిగా తలుపులేస్తే.... తలుపులన్నీ వేసేస్తే సేఫేనా? సేఫ్టిపిన్స్.. స్టాపిన్.... గ్యాస్ కొట్టే స్టౌ.... లీనా సాహూ.... దొంగలు.... అందరూ దొంగలే....నైచ్యం.... నీచత్వం ఎక్కువ బాధిస్తోంది.... బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్.... దేవదాసు.... దివోదాసహా! కాళిదాసు.... పద్మ.... చేటపెయ్య.... సరికాదు.... చేటకీ పెయ్యకీ సంబంధం లేదు.... పెయ్య అంటే దూడ....ఇంకేదో వుంది....ఓవల్స్....వల్‌దోవల్ కాషాయద్ హుం... అభిలాషదీ బగ్గన్... మీసాలు



# రేపు



వాషిరా

అల్లో నేరేడుపళ్ళు.... కండక్టర్ వస్తు న్నాడు.... పిల్లీ వచ్చే ఎలకా హుత్.... పిల్లి-పిల్లి ఎలక.... అమ్మ.... తలుపులు.... వెనుక కథలు.... కాంతమ్మగారు.... కళ్ళు యెర్రగా.... కొంచెం కోపంగా.

చక్ చక్ చక్ చక్ .... శాఖాహార ఫల హార శాల.... చాయ్.... స్టేషన్.... జనం.... గుడివాడ.... "గుడివాడ యెల్లాను ........ గుంటూరు పొయ్యాను" అబ్బాయిలు.... పువ్వుల చొక్కాలు.... లేడీస్ క్యాబిన్ లోకి యెందుకు? వెనుక ఆడవాళ్ళు........ అమ్మయ్య.... భయంలేదు .... ఎక్కడో చూసినట్లు .... ఆమెను........కొమ్మూరి హేమలత.... కొమ్మూరికి తెన్నేటికి ఎక్కడ కనెక్షన్....

టాకెటివ్‌లా ఉంది ఎదుటి బెర్త్ ఆవిడ "శాయి" కొడుకు కాబోలు.... "అయిదు రూపాయిలు కావాలి".... "నిజం చెప్పరా. ఎందుకో ...." నిజాల్ని సినిమాగా తీస్తే ఎంత భయంకరంగా ఉంటుంది? "చూస్తాను తప్పక" ఎస్యూరెన్సు.... ఇన్సూరెన్సు.... సైకలాజ్ ఇన్సూరెన్సు అన్నిటికీ ఇన్సూరెన్సు.... కాదేదీ కవిత కనర్హం అన్నట్లు.... ఔనౌను శిల్ప మన ర్హం.... శిల్పం.... కాకతీయ శిల్పం.... కరుణాకరం.... "సుగుణాకర్రావ్!" "వెధవకానా!" పిన్ని మళ్ళీ జ్ఞాపకం.... పిన్ని అహంకారం.

లైట్లు ఎదుటి బెర్తువాళ్ళు తీసేస్తే.... డబడబడబ.... టకటకటకటక.... వీళ్ళు

# వ్యోమయాన విశేషాలు

- ప్రప్రథమంగా అంతరిక్షంలోకి "యూరీ గగారిన్"ను తీసుకు వెళ్ళిన వ్యోమనౌక "వోస్టోక్" - 1. ను సెర్జి కోరిలివ్ రూపొందించారు.
- వోస్టోక్ - 6 లో అంతరిక్షంలోకి వెళ్ళిన తొలి మహిళ వాలెంటినా తెరిష్కోవాను అంతకు రెండు రోజుల క్రితమే వోస్టోక్ -5 లో అంతరిక్షంలోకి వెళ్ళిన లెఫ్టినెంట్ కల్నల్ వెలెరి బైకోవిస్కీ విష్ చేశారు. వీరిద్దరినీ "వ్యోమ దంపతులు" (space couple)గా పేర్కొన్నారు. తెరిష్కోవా భూమికి చేరిన రెండు గంటల నలభై ఆరు నిముషాలకు బైకోవిస్కీ కూడా భూమిని చేరుకున్నారు అయితే తెరిష్కోవా తరువాత ప్రముఖ వ్యోమగామి నికోలయేవ్‌ని వివాహమాడింది!
- అంతరిక్షంలో నడిచిన మొదటి వ్యక్తి అలెగ్జీలియొనోవ్. అంతరిక్షంలో ఆయన 20 నిముషాలు నడిచారు. తరువాత అమెరికాకు చెందిన ఎడ్వర్డ్ వైట్ 21 నిముషాలు నడిచారు. పైగా మొదటిసారిగా అంతరిక్షం నుంచి ఛాయా చిత్రం తీసిన వ్యక్తి ఎడ్వర్డ్ వైట్.
- చంద్రమండలంపై అడుగుపెట్టిన వ్యోమగాములు ధరించిన ప్రత్యేక దుస్తులు ఒక్కొక్కటి 15 లక్షల రూపాయలు. బరువు 27 కిలోగ్రాములు ఈ దుస్తుల్లో 21 పొరలు వున్నాయి.
- అంతరిక్షంలోని వ్యోమగాముల కోసం శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా 70 రకాల ఆహార పదార్థాలు తయారుచేశారు వ్యోమగాములు రోజుకు 600 గ్రాములు చొప్పున వీటిని తీసుకున్నారు.
- అపోల్లో-11 అంతరిక్ష నౌక విలువ 1400 కోట్ల రూపాయలు. ఇది రెండు నిముషాల నలభై సెకన్ల కాలంలో దీని మొదటి ఇంజను 81,0,000 లీటర్ల కిరసనాయిలు, 1.3.1000 లీటర్ల ద్రవ రూపంలో వున్న ఆక్సిజన్‌ని దహించింది. రెండవ ఇంజను ఆరు నిముషాలకు 441 టన్నుల ఇంధనాన్ని దహించింది ఈ ఆరు నిముషాల్లో నూ గంటకు 22000 కిలోమీటర్ల వేగంతో రాకెట్‌ను 182 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకొని పోయింది
- అంతరిక్షంలో రాత్రి,పగలు భేదంవుండదు.
- చంద్రమామను ఫొటోలు తీసి భూమికి పంపిన అతి చిన్న టెలివిజన్ కెమెరా సిగరెట్టు పెట్టెకన్నా చిన్నది. దీనిలో 250 భాగాలున్నాయి. దీని బరువు 3కిలోగ్రాములు. దీని విలువ 28.50 000. రూపాయలు దీనిలోని కొన్ని భాగాలు కంటిపాపకన్నా చిన్నవి
- చంద్రమామ నుంచి మొదటిసారిగా 3.84.000 కిలోమీటర్ల దూరంలో వున్న భూమిని చూసిన వ్యక్తి ఆర్మ్‌స్ట్రాంగ్.

—జె. ఎస్.

కాలవలో నీళ్ళు.... పైన వెన్నెల పారుతోంది.... ఒడ్డున ఇళ్ళు ... "ఎంత అందంగా వుంది!" "ఏటి ఒడ్డున ఇల్లు కడదాం పదరా" ఏరు.... పడవ.... పూల పడవలా.... అతనితో పడవలో ఎంత బాగుందా ప్రయాణం!

గ్రిల్లు... మేడమీద.... తాజ్‌మహల్....

ఉచితం · ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి Address

Samaj Kalyan (R.L. 78)
(P. o) Katri Sarai (Gaya)

జ్యామెట్రికల్ ఫిగర్స్.... ముస్లింలు.... షబ్‌నమ్.... అహమ్మదు "ఏయ్ రామారావుగారూ" షరీద్....బిస్మిల్లా.... షెహనాయ్.... షెహనాజ్.... విద్యాధరి.... హాస్పిటల్.... కత్తినయినా కాకపోతిని... గాయముల కడతేర్చగా.... స్టైత్‌నయినా కాకపోతిని.... హృదయవలల రొదవిందుగా....

పొగ.... బొగ్గు.... రైలు.... ధుడుం ధుడుం ... బొగ్గు.... సీలుఎక్స్‌ప్రెస్.... కోల్ ఎక్స్‌ప్రెస్.... "స్నానం చేద్దామని చెవులు ఒకసారి ఇలా తుడిస్తే ఎంత మట్టో".... రైలు స్లో డౌన్.... స్లో పాయిజన్.... జీవితంలో స్లో పాయిజనింగ్ జరుగుతోంది ఎక్కడో....

ఆవిడ.... ఎదురు బెర్త్ ఆవిడ-పెద్దావిడ నిద్రపోతోందా ?.... తలక్రింద ఎట్టిటి కుషన్లు....సినిమా హనుమంతుడి తోకలాగ ధడ ధడ ధడ.... నీడలు.... మళ్ళీ వెలుగు తగ్గిపోయింది.... నిశ్శబ్దం.... రైలాగింది చెప్పులు చప్పుడు.... ఫ్యాన్ తిరుగుతున్న చప్పుడు.... సిల్ పిక్చర్లా ఉన్నాయి పైట చెట్లు.... "సిల్ లైఫ్" కలర్ ఫొటో.... చిన్నప్పటి జ్ఞాపకం.... గుర్తు రావడం లేదు.... హాచ్.... తుమ్ము.... ఎగపీల్పు. అవతలి బెర్తుపై గుండాయన గుర్రు.... రైలు మళ్ళీ మెల్లిగా మూలుగుతూ.... కిర్రు....కిర్రు....కీచు....కీచు .... స్టేషను లైట్లు....జనాలు....పౌరులు.... బ్రతకలేని వాళ్ళు....అమర వీరులు....అమరు లయ్యేరు కనుక వీరులా? వీరులు కనుక అమరులయ్యేరా?....రెండూ ఒకటేనా?.... రెండూ రెండూ నాలుగు....నాలుగుకళ్ళు రెండయినాయి....కళ్ళ వ్యాపారాలు....కుల వృత్తులు....వృత్తాలు....వృత్తాసురుడు.... ఎవడువాడు....ఎచటివాడు.... ఇటువచ్చిన తెల్లి వాడు.... తెల్ల వారుట ... గంట... జడ జడ జడ జడ .. ట్రాలీ చప్పుడు.

"ఆ మనిసి నెక్కడనీయవేందయ్యా!" మగమడుసులుండరా! రారా నా స్వామి రారా.... ఎదురుగా ఇల్లు....నీలంకాదు.... ఆకుపచ్చ.... శ్యామల వర్ణం ....శ్యామల.. దొంగ.... గిలీ లాలెస్‌నెస్....నెస్‌కేఫీ ... కెఫేరియా.... డిఫ్తేరియా.... జుయ్‌జుయ్ జుయ్ కీచురాళ్ళు.... తెలీదు మళ్ళీ లైటు బ్రైట్ అయింది. బొద్దింక అట్నించిటు ఎగిరింది. రైలు వేగం పెరిగింది.

ఎదురు బెర్త్ అమ్మాయి....ఎరుపురంగు బ్యాగ్ పిన్నికి యిష్టం.... న్యూరాసిసా.... చెప్పులు కూడా ఎరుపే. "చిలక ముక్కు ఎఱుపు" "చిగురాకులలో చిలకమ్మా" చిలుకకీ గోరింకకీ జోడీ ఎలాగ? కథల్లో నేనా! ఇలలో కాదు.... కాదు సుమా కల కాదుసుమా! బైట లైనుగా కొబ్బరి చెట్లు.... రావులపాలెం.... వంతెన.... నీళ్ళు.... పిల్లలు.... తల్లులు.... ఆవిడ... ఎదుటి బెర్త్ పెద్దావిడ.. పొట్టమీద ముడతలు.. "అది మీరు చేయాల్సినపని కాదు" నవ్వు.... మీసాలు.. మీసాల రోసాలు.... "అబ్బో నేరేడు పళ్ళు".... జంబూ.... జంబూ మలాక.... పిచ్చయ్యగారు....

ఈ ప్రయాణం ఎక్కడికి :.. కలకత్తా పోతే బాగుణ్ణు.... సైకిలాబ్ పడదనా.... "కూ"........గొప్పగా కూస్తోంది పొగ బండి.... బొగు బండి.... ఇంజను.... "ఉరేయ్ ఇంజనువాడూ! ఇంజనువాడూ! నన్నోసారి ఇంజను తోలనిస్తావా!" బాబు.... అరుంధతి.... వశిష్ఠుడేడీ ?.... ఇంతింత బొగ్గు.... సైకిలాబ్ ముక్కల్లా.... అందరికీ చావంటే ఎందుకింత భయం ? "చావుని గురించిన ఆలోచనే మృత్యువు" మృత్యోర్మా అమృతం గమయ.... అమృతం కురిసిన రాత్రి.... తిలక్.... కాకినాడ.... మంచంకింద కవి

త్వం.... అర్థంకానివాడికి చెవిటివాడి ముందు శంఖం.... ఎదురు బెర్త్ అమ్మాయి ఇటే చూస్తోంది. ఆ అమ్మాయి జడ ఎంత బాగుంది?.

'పిలకలాఫుండే లాగమురి' జ్ఞాపకం. నవ్వు.... రైలు మళ్ళీ స్లోడౌన్.... ఎంత పెద్ద యిల్లో.... సినిమాహాల్లా .... ఇంకా యెన్ని హాల్టులు?.... చచ్చేదాకా.... అంటే గమ్యం చేరేదాకా.... ఆ తరువాత హాల్టు అయినా, బోల్టులయినా నా కెందుకు!.... ఏదో పేరు తెలీని స్టేషను.... కుక్క మొరిగింది.... భౌ, భౌ! మహా హుషారుగా మొరుగుతోంది.... దూరంగా లైటు మెరుస్తోంది.... ఇళ్ళు కవతలగా.... నిదరపోలు కాదుకదా.... నిదరపోలు.... బిక్కపోలు...

ఉక్క... గాలిలేదు.. వెచ్చగా వుంది. ఏదో కుడుతోంది. నల్లి అయివుంటుంది. ఈ కాలికి బుద్ధిలేదు.... మునకుండి ఏడిస్తేగా ... "ఎదీ రెండు కన్నీటి బొట్లు." "నన్ను పుట్టించిన ఆ దేవుడు కూడా నన్నేడిపించలేక పోయాడు. మిస్టర్ సుగుణాకర్రావ్!" కర్రావారు.... కంపావారు.... కంపాకోలా.... బొంబాయి.... హమీద్.... సబ్‌నోస్.... అందరూ స్నాబ్ సే.... మామ్.... మాఘే మేఘే గతంవయః.... మాఘమ్‌ను చదివేటప్పటికే జీవితం అయిపోయేట్లుంది.

ఉయ్యాల ఊగుతోంది రైలు..... ఉయ్యాల.... దోంద్.... బొద్దింక........ పెద్దమ్మ పేదరాశి పెద్దమ్మ.... చిక్కుడు చెట్టు.... బంగారు చిక్కుళ్ళు.... పెద్దబాబాయి.... జాంబియా.... జలాలుద్దీన్... జాబాలి .. ఎవడు వాడు? ఋషి.... రమణ... అరుణాచలం.... చలం.... ప్రపంచం ఎవరిని బ్రతకనిచ్చింది కనుక! ఏదో వాసన దుర్వాసన.... అన్నీ వాసన .... విషపు వాసనలు... సెన్సువల్... ఈ వాసనలు .. ఇవే లేకపోతే.... ఏముంది? కష్టాలు లేవు కన్నీళ్ళు లేవు. చింతించవలసిన అవసరం లేదు... యోగిలాగ .. జోగిలాగ... ఎక్కడికి? హిమాలయాల్లోకా? ఆలయాల్లో ఉన్నాడా శివుడు? శివుడు.... గరళకంఠుడు.... గరళం.... మృత్యువుకు మరో పేరు.... అయితేనేం.... అదే ఒక్కొక్కసారి అమృతంలా ప్రాణం నిలుపుతుంది.... అమృతం.... మృత్యువు.... రెండూ ఒక్కటేనా?.... అమృతం .... దొరకలేదు.... మృత్యువు అన్నా దొరికేనా!.... తప్పకుండాను.... క్రమం తప్పకుండా.... క్రమం లేదు జీవితంలో.... మృత్యువు అందులోకి అక్రమంగా ప్రవేశిస్తే మాత్రం తప్పేమిటి?.... లేదు.... ధట్.... తలుపు .......

గుండాయన కాబోలు లావెటరి తలుపు వేశాడు.... డిగ్ డిగ్ డిగ్ డిగ్.... చప్పుడు మధ్య ఏమాత్రం నిశ్శబ్దంలేదు.... అంతే వేగం.... ఎడి.... వేగంగా పోతోంది రైలు బయట తలుపు కొట్టుకుంటోంది కండక్టరు మర్చిపోవడం లాక్ చేయడం.. పేపర్సేనో.

గాలి తోసేస్తోంది.... గాలిలా వేగం.... వాయువేగం.... క్రింద చీకటి.... వెలుతురు లేదు.... నల్లని చీకటి.... మృత్యువు.... జీవితంలోకి అక్రమంగా ప్రవేశిస్తే?....



# నోటి దుర్వాసనను ఆపండి..
# కోల్గేట్ డెంటల్ క్రీమ్‌తో దంతక్షయాన్ని ఎదుర్కోండి

ప్రతిసారి భోజనం చేసిన తర్వాత, కోల్గేట్‌తో మీ పళ్ళను తోముకోండి. కోల్గేట్, ప్రపంచమంతటా దంత వైద్యులు సిఫారసు చేసే తీరులో మీకు రక్షణ సమకూరుస్తుంది.

మీ పళ్ళలో మిగిలిపోయే ఆహారపు అణువులలో బాక్టీరియా పెరుగుతుంది. అవి ముందు నోటి దుర్వాసన, ఆపైన బాధాకరమైన దంతక్షయాన్ని కలిగిస్తాయి.

అందుకే మరి ఎప్పుడూ భోజనంకాగానే కోల్గేట్‌తో తోముకోవడం సరైన మార్గం. అది మీ శ్వాసను తాజాగా రూపొందించేందుకు. పళ్ళను తెల్లగా మెరిసేలా చేసేందుకు, దంతక్షయాన్ని ఎదిరించేందుకు అమోఘమైనదని రుజువయింది.

కోల్గేట్ యొక్క నమ్మకమైన సూత్రీకరణ ఎలా పనిచేస్తుందంటే :



మీ పళ్ళలో ఇరుక్కుపోయిన ఆహారపు అణువులలో దుర్వాసన, దంతక్షయాన్ని కలిగించే బాక్టీరియా పెరుగుతుంది.

కోల్గేట్ యొక్క సాటిలేని చిక్కని నురుగు బాగా లోతుకుచేరి హానికరమైన ఆహారపు అణువులను బాక్టీరియాను తొలగిస్తుంది.

పలిం...
శ్వాస తాజాగా ఉందన్న నమ్మకం, దంతక్షయంనుండి రక్షణ.

హాయినిగొల్పే, తాజా శ్వాసకోసం, పళ్ళను తెల్లగా రూపొందించేందుకు ప్రపంచంలో ఎక్కువ మంది, మరే ఇతర టూత్‌పేస్ట్ కన్న ఎక్కువగా కోల్గేట్‌నే కొంటూ ఉంటారు!




ఒక్క దంతవైద్యులు మాత్రమే దీనికన్న మేలైన దంతరక్షణ సమకూర్చగలరు.

DC.G.61 TL

గాథావళి :

# సహాయం చేస్తాను

ఇంగ్లీషు అంటే చాలా అభిమానం వున్న ఒక సజ్జనుడు గాంధిజీ ఆశ్రమానికి వచ్చాడు. మాటల సందర్భంలో ఆయన గాంధీగారితో "నేనేమైనా మీకు సహాయం చేయగలనా?" అని ప్రశ్నించాడు. "మాకు సహాయం చేయగలిగేటంత తీరుబడి ఉందా మీకు?" బాపూజీ అడిగారు ఆ సజ్జనుడి అభిప్రాయమేమిటంటే బాపూజీ తనను 'హరిజన్' పత్రికకు ఏదైనా వ్యాసం వ్రాయమని అడుగుతారని. గాంధీగారు అడిగిన దానికాతడు "మీకు సహాయం చెయ్యడానికి చాలా తీరిక ఉంది" అన్నాడు.



అప్పుడు బాపూజీ "చాలా సంతోషం మా ఆశ్రమంలో బోలెడు గోధుమలు వున్నాయి. వాటిని కాస్త విసిరి పెట్టండి" అన్నాడు.

ఆ సజ్జనుడికి నోటమాట రాలేదు.

సేకరణ : ఐ. సూర్యనారాయణ

నేను.... నలుపు.... నల్లటి నేను నలుపులో చీకటిలో.... కలసి.... ప్రయాణించి మృత్యువును చేరుకోవాలి.... ఆ తరువాత అంతా వెలుతురే.... ముందే చీకటి.... ఆ పైనంతా వెలుగే.... ప్రవేశమే ఆలశ్యం.... ఆలశ్యం చేయకూడదు.... చేసీ చేసీ వెలుగంతా వెళ్ళిపోయింది.... ఇప్పుడు చీకట్లోంచే వెలుగును వెతకాలి. త్వరగా.... కాని.... కళ్ళు మూసుకుంటే భయం వేయదేమో.... కన్నులు మూసుకుంటే ప్రార్థన చేయాలనిపిస్తోంది. ఏం చెయ్యను!

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనా సరే వానిరంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మమువలె నుండిపోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితముగా పంపెదము. వెంటనే వ్రాయండి

Jeevan kalyan (B.B-8)
P.O. KATRI SARAI (GAYA)

"మనిషికి అంతం అంటూ పెట్టి పెద్ద ఉపకారం చేసేశావు బాబూ! కానీ నేనింకో చిన్న కోరిక అడుగుతున్నాను. నువ్వు అంటూ వుంటే నన్ను మళ్ళీ మళ్ళీ పుట్టించకు."

అబ్బా!.... నెప్పి. ఏదో కుట్టింది. కళ్ళు జిగేలుమనేలా వెలుగు. "ఏమిటిలా! తలుపులేయడం నా డ్యూటీ. వేయడం మర్చిపోతే నాకు చెప్పాలి" .... ప్రతుళ్ళి పడేట్లు నా వెనకే కండక్టరు...."ఇలా మీ యిష్టం వచ్చినట్లు తీసేస్తే యెలా? ఏమనుకుంటున్నారు? అసలు మీకేం కావాలి?".. దుఃఖం....ఏమిటిది? ఎందుకిలాగయింది! అంతా పాడయిపోయింది .... వెలుతురులోకి లేదా యిక దారి?...."ఏమిటిలా చూస్తారు?....మీ మంచికే చెప్తుంటా.... ఇదసలే మంచి రూటుకాదు"....పిచ్చివాడు ఏదన్నా అయితేనా!....అవడానికేగా తాళం వేశేశాడు. తలుపులు మూసేశాడు... కాలు నెప్పి....ఇందాకటి నొప్పి....శివుడి ఆజ్ఞ అయింది కాబోలు కుట్టడానికి........ గండుచీమ.... చావడానికి నాకు మాత్రం ఇవ్వలేదు ఆజ్ఞ శివుడు.. మళ్ళీ క్యాబిన్.. లేడీస్ క్యాబిన్.. ప్రత్యేకత.. దేవుడు ప్రత్యేకంగా తయారుచేశాడు ఏడుపు కోసమే ఆడవాళ్ళని....

వెలుతురు క్యాబిన్ నిండా.... పెద్దావిడ లేచి కూర్చుంది.... పైట సవరింపు.... "ఏమ్మాయీ .... నిద్ర రాడంలేదూ !.... "లేదూ"... ఆ గొంతు వంపు.. ఎక్కడో ఎప్పుడో విన్నాను.. ఎక్కడ ? పొరలు.. మసిష్కపు పొరలమధ్యలో.. ఎక్కడో దాక్కుని ఎప్పుడో విన్న "లేదూ!" అన్న గొంతు వంపు........ చావడానికిప్పుడు వీల్లేదు.... కాస్సేపాగాలి.... మళ్ళీ చీకటి.... అప్పుడు వెలుతుర్లోకి. "లేదూ!" ఎప్పుడో విన్న గొంతు. ధడబ్ ధడబ్.... మళ్ళీ స్టేషన్ కాబోలు నా పీకల మీదకి. పీకలు.... పీకుడు.... వేపుడు.... బంగాళా దుంపలు.... దుంప మొహం దానా" చిన్నప్పుడు తిట్లు. దొడ్లో జామ చెట్టు పైకి ఎక్కి మగ్గిన పళ్ళు... పరికిణీలో దాచుకుంటూ.. జామిచెట్టు.. జానకి అత్త... పెంకుటిల్లు... బాబు .. చిన్న బాబు... బొద్దు బొద్దు చేతులమధ్య బుద్ధిగా పలక పట్టుకుని... ఎన్ని గుసగుసలో గోడల పైనుండి.... బాబు నాన్న ఎప్పుడూ రాడేం ?" ఆవిడ.... జానకత్త.. ఎంత వెలుగు ఆ మొహంలో.... కళ్ళు.... ఎంత లోతు.... సముద్రంలాగ.... ఎంత ప్రశాంతత !....

"చిట్టితల్లీ !.... స్కూలు కెళ్ళలేదూ!" "లేదూ....!" అవును. ఇందాకటి....'నిద్ర రాడం లేదూ....!" అదే వంపు.... గొంతులో.... కాని ఈవిడ జానకత్తకాదు.... జానకత్త.... కత్తి.... "కత్తిలాంటిది జానకి" అనేవారు నాన్న.... కసి.... అమ్మ కళ్ళల్లో.... ఎందుకు ?" అవును....తుప్పు పట్టిన కత్తి.... జాగ్రత్తగా లేకపోతే గాయం సెప్టిక్కవుతుంది".... కత్తులతో వృత్తి....నాన్న....డాక్టరు."నన్ను వేటాడి వేటాడిచంపుతున్నారు....డాక్టరుగారూ....' జానకత్త కన్నీరు....ఉప్పు....సముద్రం.. సప్త సముద్రాలు....రాజకుమారుడు.... ఆవలి వొడ్డున .... "దేనికయినా ఆవలి వొడ్డనేది యెప్పుడూ వుంటుంది జానకీ" నిజమే........ఆవలివొడ్డు దొరికింది జానకత్తకు....ఆయన........ఆయనే జానకత మొగుడు కాబోలు— డబ్బులన్నీ పట్టుకుపోతాడని అంటుండేదిఅమ్మ....పాపం... అమ్మకి జాలే....కానీ భయంకూడా.... అదో రకంభయం....బాబు....జానకత్తబాబు

పక్కింటి పాపాయి తన బొమ్మను లాక్కుంటుందని భయంగా ముఖం పెట్టే వాడు....బాబు........ఇప్పుడు ధన్‌బాద్‌లో సెటిలయ్యాడట పెద్ద ఉద్యోగంలో.... జానకత్త ఉత్తరం.. నీలిరంగు కాగితం.. చిటితల్లీ.. అంటూ ఇంకా ఆనాటి పొట్టి జడల చిట్టితల్లినేనా.... ఓడిపోకుండా బెదిరిపోకుండా.... నిలచినందుకు.... ఫలితంగా... బాబు ఈ నాడు ఒక వ్యక్తిగా నిలచాడండి. తన కలలకి రూపం కల్పించాడట .. ఇప్పుడు గట్టున చేరిన జానకత్త. ఆవలి ఒడ్డు గురించి తనకా నాడు చెప్పిన నాన్న.. ఋణం తీర్చుకోలేనంటూ.... నీలంరంగు.... కాగితం మీద.. నల్లటి అక్షరాలు.... ఏళ్ళకు తరబడి పోరాటం జరిపి "నేను గెలిచాను" అంటున్న చేయి వ్రాసిన అక్షరాలు........గుండ్రంగా కదులుతూ....కదలిక....చైతన్యం....జీవితం.. జీవించడానికే....జానకత్తలాగా నేను తీరం చేరలేనూ....ఆవలిగట్టు .... ఆవలిగట్టు.... జీవితం....జీవి....ఆశాజీవి....చిరంజీవి.... ఆశ....రేపుమీద....పెరిగిన నమ్మకం.... జీవితంమీద....చైతన్యంమీద.... ఇందాకా పెరిగిన వెలుతురు అలాగే నిశ్చలంగా వుంది....తగ్గకుండా....అలాగే వుండాలి.., తగ్గకూడదు... చీకటి రాకూడదు.... "పడుకో. అమ్మాయీ.... మీ వూరొచ్చే సరికి వెలుతురొచ్చేస్తుందిలే...." ఎదురు బెర్త్‌పై ఆవిడ .. కొంగు నిండుగా కప్పుకుని ఇటిన్నించటు... మెళ్లో మంగళ సూత్రాలు బల్లపై బడి చప్పుడు చేశాయి.. బయట కిటికీలో చీకటి పలచబడింది.... రేపటికి ఎంతో సేపు లేదు, ఆలశ్యం...

బెర్త్ మీద ఎంతో హాయిగా వుంది .. చల్లని గాలి... విశాలంగా వుంది... పడుకోడానికి వీలుగా... బెత్త...రైలు వేగంగా పోతోంది . కూత వేస్తోంది ఆగకుండా .. శబ్ద చైతన్యానికి ప్రతీకలా... ★


